క్లుప్తంగా...

నేడు కార్వాన్‌లో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పర్యటన

గోల్కొండ: నేడు కార్వాన్ నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసి పాదయాత్ర చేయనున్నారని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ తెలిపారు. ఈ పర్యటనలో ఆయన స్థానికులను కలుసుకుంటూ వారి సమస్యలు తెలుసుకుంటారని ఆయన తెలిపారు. రూ.76.4 కోట్ల రూపాయల విలువ గల అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

బీఆర్‌ఎస్ కాలం చెల్లిన పార్టీ

గోల్కొండ: బీఆర్‌ఎస్ కాలం చెల్లిన పార్టీ అని బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ టి.అమర్‌సింగ్ అన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీని దేశ ప్రజలు తిరస్కరించిన పార్టీ అని అన్నారు. రాష్ట్రాన్ని తన సొంత జాగీరులా భావిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆయన అన్నారు. ఇక కాంగ్రెస్ అవకతవక విధానాలు, ఆ పార్టీలో ఉన్న కుటుంబ పాలనతో విసుగెత్తిన దేశ ప్రజలు దానికి ఏనాడో పక్కనపెట్టారన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు.

క్రీడలలో రాణించాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడం ఎంతో ఆనందంగా ఉందని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్పొరేషన్ ఛైర్మన్ ఎస్.వేణుగోపాలచారి అన్నారు. ఆల్ తెలంగాణ గ్రామీణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత రెండురోజులుగా జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గ్రామాలలో ఉన్నటువంటి క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసుకువచ్చేందుకు ఇటువంటి పోటీలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సినీనటులు కిరణ్, రాధ, ఫిట్నెస్ నిపుణులు అనుప్రసాద్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ భువనేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయడంపై హర్షం

నాంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయడం పట్ల తెలంగాణ పెన్షనర్స్ కేంద్ర సంఘం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల పట్ల సీఎం కేసీఆర్ ఉన్న నిబద్ధత, స్నేహపూర్వక చొరవకు కృతజ్ఞతలు తెలిపింది. వేతన సవరణ సంఘం నివేదిక సమర్పించేలోగా ఇచ్చిన తాత్కాలిక భృతి ఐదు శాతం చూసి పెన్షనర్లందరూ దిగ్భ్రాంతికి గురైనట్లు పేర్కొంది. అసెంబ్లీలో కేసీఆర్ చెప్పినట్లుగా అత్యధిక తాత్కలిక భృతి ప్రకటిస్తారని విశ్వసించినా ఆ స్థాయిలో ప్రకటించకపోవడం వల్ల నిరాశకు లోనైనట్లు తెలంగాణ పెన్షనర్స్ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు గాజుల నర్సయ్య, ప్రధాన కార్యదర్శి ఇ.నవనీతరావు పేర్కొన్నారు. పెన్షనర్ల కోరికను మన్నించి కనీసం 18 శాతం తాత్కాలిక భృతిని ఇవ్వాలని కోరారు. అలాగే ఆరోగ్య శ్రీ ట్రస్టును నెలకొల్పాలని, ఇందులో ఉద్యోగులను, పెన్షనర్లను సభ్యులుగా చేర్చాలని కోరారు.

శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు

గోల్కొండ: కార్వాన్‌లో కొలువుదీరి ఉన్న శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయంలో ఈ సంవత్సరం నవరాత్రి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటి ఛైర్మన్ టి.అమర్‌సింగ్ తెలిపారు. బుధవారం ఆయన ఆలయ ప్రాంగణంలో నవరాత్రి ఉత్సవాల పూజా కార్యక్రమాలను వెల్లడించారు. ఈ నెల 15 నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతాయని ఆ రోజు అమ్మవారు బ్రహ్మారాంభిక రూపంలో దర్శనం ఇస్తారని తెలిపారు.

ఉద్యోగుల సంక్షేమానికి టీఎన్జీఓ కృషి


ఉద్యోగుల సమావేశంలో పాల్గొన్న టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని

అబిడ్స్: ఉద్యోగుల సంక్షేమానికి టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా యూనియన్ ప్రత్యేక కృషి చేస్తోందని హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పలు విషయాలు వెల్లడించారు. పలు సమస్యలు, సంక్షేమం, ఇతర వివరాలన్ని ప్రభుత్వంలోని పలు శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం కార్డును అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కొత్త పీఆర్సీ, ఐఆర్‌తో చర్చలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ కేఆర్.రాజ్‌కుమార్, విక్రమ్‌కుమార్, వరదరాజు, కుర్రాడి శ్రీనివాస్, మహ్మద్ అబ్దుల్ పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల ఆందోళన


ఉపాధ్యాయులు ఆందోళన చేపడుతున్న దృశ్యం

నాంపల్లి: గిరిజన సంక్షేమ ఆశ్రమ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల కాల పట్టిక ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బుధవారం టీఎస్ యుటిఎఫ్ నేతృత్వంలో ఆ శాఖ ఉపాధ్యాయులు మాసబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య అధ్యక్షత వహించి ప్రసంగించారు. గిరిజన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల విషయంలో కమీషనర్ నిర్లక్ష్యాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టిఎస్ యుటిఎఫ్ చావ రవి మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖ 1800 పాఠశాలల్లో ఆరువేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రతిసారి పాఠశాల విద్యా శాఖలో ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించిన సందర్భంలోనే గిరిజన ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సంవత్సరం జనవరిలోనే విద్యాశాఖ జిఓ విడుదల చేసినా, ఇప్పుడు బదిలీలు జరుగుతున్నా గిరిజన సంక్షేమ శాఖ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఐదేళ్లుగా బదిలీలు లేక ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నట్లు వాపోయారు. పదోన్నతులు లేకపోవడంతో అర్హత గల ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీరాములు మాట్లాడుతూ... ఎన్నికల ప్రకటన వెలువడక ముందే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కాల పట్టికను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ నాయకులు లక్ష్మారెడ్డి, శాంతకుమారి, లావణ్య, కిషోర్ సింగ్, పి.నాగేశ్వరరావు, ఎస్.కృష్ణ, వాసుదేవ రెడ్డి, రాందాస్, బాలు, భద్రు, అనసూయ, డి.నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు చందన్, సనత్ కుమార్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్‌షాహీలో నీటి సమస్యకు పరిష్కారం





పాడైన బూస్టర్‌కు మరమ్మత్తులు చేస్తున్న జలమండలి సిబ్బంది

చార్మినార్: గత కొంత కాలంగా మంచినీటి కొరతతో బాధపడుతున్న సుల్తాన్‌షాహీలోని వాల్మీకినగర్,హనుమాన్ టెంపుల్ వీధి,సుల్తాన్‌షాహీ జూలా తదితర వీధుల్లోని స్థానికులకు బుధవారం మంచి నీటి సమస్య తొలగిపోయింది. జలమండలి డివిజన్-1 జనరల్ మేనేజర్ కృష్ణ నాయక్ ఆదేశాల మేరకు మొఘల్‌పురా జలమండలి అధికారులు, సిబ్బంది వెంటనే నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. 'తాగునీటి కటకట' అనే శీర్షికతో బుధవారం 'సాక్షి' దిన పత్రికలో సుల్తాన్‌షాహీలో మంచినీటి ఎద్దడి ఎక్కువగా ఉందనే విషయాన్ని ప్రత్యేక కథనంగా ప్రచురించింది. వెంటనే స్పందించిన జనరల్ మేనేజర్ కృష్ణ నాయక్ క్షేత్ర స్థాయి పరిశీలన చేసి యుద్ధ ప్రాతిపదికన పాడైన బూస్టర్‌కు మరమ్మత్తులు చేయించి నీటి సమస్యను తొలగింప చేశారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం....

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా 2340 దేవాలయాలతో పాటు మరో 350 దేవాలయాలకు ధూప దీప నైవేద్య పథకాన్ని అమలు చేశారని అర్చక ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కృష్ణమాచారిలు తెలిపారు. ఈ మేరకు బుధవారం బొగ్గులకుంటలోని దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.... రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో గత రెండు నెలల క్రితం 2340 దేవాలయాలకు దూప, దీప, నైవేద్య పథకం అమలు చేయడంతో పాటు మరో 350 దేవాలయాలకు ఈ పథకాన్ని విస్తరించాలని తెలిపారు. దీనిపై తమ జేఏసీ హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు బద్రీనాథ్ నాదాచార్యులు, అగ్నిహోత్రం చంద్రశేఖర శర్మ, పరశురాం, రవీంద్ర చార్యులు, మఠం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాషువా రచనలు సామాజిక చైతన్య కరదీపికలు


జాషువా, ప్రసాద రావుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న శిఖామణి

నాంపల్లి: దళిత చైతన్యానికి ఆద్యుడు గుర్రం జాషువా అని ప్రముఖ కవి ఆచార్య శిఖామణి అన్నారు. సమత సాహితీ వేదిక ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా 128వ జయంతి వేడుకలు బుధవారం రాత్రి నాంపల్లిలోని తెలుగు వర్శిటీ సమావేశ మందిరంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమనికి హాజరైన ఆయన గుర్రం జాషువా, సమతా సాహితీవేదిక వ్యవస్థాపకులు కాకుమాను ప్రసాదరావు చిత్రపటాలకు నివాళులర్పించి ప్రసంగించారు. సామాజిక ప్రయోజనాల కోసం జాషువా అనేక రచనలు చేసి ప్రజలను చైతన్యవంతులను చేశారని కొనియాడారు. తక్కువ కులంగా భావించబడ్డ జాషువా అనేక అవమానాలు, అసమానతలను ఎదుర్కొన్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సమత సాహితీ వేదిక అధ్యక్షురాలు కాకుమాను శశిశ్రీ, కవి డాక్టర్ కోయి కోటేశ్వరరావు, జాషువా అభిమానులు పాల్గొన్నారు.

పేద ముస్లిం విద్యార్థుల కోసం ఫెలోషిప్

చార్మినార్: తెలంగాణలోని పేద ముస్లిం విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఆర్థిక భరోసా కల్పించేందుకు జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మౌలానా అబ్దుల్ బాసిత్ అన్వర్ ఫెలోషిప్ కార్యక్రమాన్ని బుధవారం జమాతే ఇస్లామీ హింద్ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ ఖాలిద్ ముబాషీర్ జాఫర్ ప్రారంభించారు. జమాతే ఇస్లామీ హింద్ ఉమ్మడి ఏపీ అధ్యక్షులుగా సేవలందించిన మౌలానా అబ్దుల్ బాసిత్ అన్వర్ పేరును ఈ ఫెలోషిఫ్‌కు పెట్టడం గౌరవ సూచికమన్నారు. మీడియా, చరిత్ర, అర్థశాస్త్రం, న్యాయ శాస్త్రాల్లో ఉన్నత చదువులు అర్జిస్తున్న వారు ఈ ఫెలోషిఫ్ కార్యక్రమానికి అర్హులన్నారు. వివరాలకు 9703809595లో సంప్రదించాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


సంఘటన స్థలం వద్ద పోలీసులు

విజయనగర్‌కాలనీ: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ చెరుకుపల్లి శ్రీనివాస్, ఎస్ఐ ఆదిల్ రియాజ్‌ఖాన్ తెలిపిన మేరకు.. గుడిమల్కాపూర్‌లో ఓ వ్యక్తి విద్యుత్‌స్థంభం, కరెంటు తీగల వద్ద అపస్మారక స్థితిలో పడిఉన్నాడని పోలీసులకు సమాచారం వచ్చింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు స్పృహలేకుండా పడిఉన్న వ్యక్తి కూలీపనులు చేసుకుని జీవించే బీహార్‌కు చెందిన సుధీర్‌రామ్(40)గా గుర్తించారు. బాధితుడిని వైద్య చికిత్సల నిమిత్తం ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విద్యుత్‌షాక్‌కు గురైనట్లు ఒంటిపై ఆయా గాయాలు ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించి అనుమానాస్పద మృతి క్రింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రమణీయం నృత్యం



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య సంస్థ శ్రీచక్ర కూచిపూడి డ్యాన్స్ అకాడమి 16వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పాంజలి, బ్రహ్మాంజలి, వినాయక కౌవుత్వం, రామాయణ శబ్దం వంటి పలు అంశాలపై 30 మంది విద్యార్థులు ఏకకాలంలో చేసినటువంటి నృత్య ప్రదర్శనలు సమ్మోహన పరిచాయి. కార్యక్రమంలో నృత్యగురువులు డాక్టర్ నళిని రమణ, శేషం రమణలతోపాటు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పురానాపూల్ చౌరస్తాలో నాకాబందీ

- తనిఖీల్లో రూ.18 లక్షల నగదు లభ్యం
- 140 వాహనాలు సీజ్
- 50 మద్యం బాటిళ్లు స్వాధీనం



జియాగూడ: కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో నాకా బంది నిర్వహించి పెద్ద ఎత్తున 140 వాహనాలు, రూ.18 లక్షల నగదు, 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖారే అన్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పురానాపూల్ చౌరస్తాలో డీసీపీ కిరణ్ ఖారే, అడిషనల్ డీసీపీ అశ్వక్, కుల్సుంపురా, గోషామహల్ ఏసీపీలు జావేద్, వెంకట్‌రెడ్డిలతో పాటు సుమారు 100 మంది పోలీస్ సిబ్బంది నాకా బంది తనిఖీలు నిర్వహించారు. అనంతరం కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ కిరణ్‌ఖారే వివరాలను వెల్లడించారు. చౌరస్తా వద్ద గల బార్లు, రెస్టారెంట్లు, పాన్‌షాపులు, లాడ్జీలలో విస్తృతంగా తనిఖీలు చేశామని, గుట్కా, పాన్ మసాలా, ఫారిన్ సిగరెట్ల విక్రయాలు కూడా జరుగుతున్నాయా అని, హోటళ్లలో వాడుతున్న సిలిండర్లు కూడా కమర్షియలా, డొమెస్టికా అని తనిఖీలు నిర్వహించారు. అలాగే వాహనాల తనిఖీలలో రూ.18 లక్షల నగదు దొరికిందని, దీనిని ఐటీ విభాగానికి పంపిస్తున్నామన్నారు. 140 వాహనాలు ఎలాంటి డాక్యూమెంట్లు, నెంబర్‌ప్లేట్లు లేని వాటిని సీజ్ చేశామన్నారు. అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్ షాపులలో దాడులు చేసి 50 మద్యం బాటిళ్లు లభించాయన్నారు. కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ల ఆగడాలు, సంఘ విద్రోహ కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు సమాచారం లభించడంతో నాకాబంధీ తనిఖీలు చేపట్టామన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కూడా రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఈ కార్యక్రమంలో కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, షాహినాయత్‌గంజ్ రవీందర్, మంగళ్‌హాట్ రవి, టప్పాచబుత్ర శ్రీనివాస్, గుడిమల్కాపూర్ రెహ్మాన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సీఎం కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ల పంపిణీ చారిత్రాత్మకం


స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ ఆంజనేయగౌడ్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ తెలిపారు. బుధవారం ఎల్బీస్టేడియంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ నేటి యువతరానికి గొప్ప వరమన్నారు. రూ.100 కోట్లకు పై బడ్జెట్ కేటాయించి స్పోర్ట్స్ కిట్స్ పేరుతో యువతరానికి భారీ కానుకను అందజేస్తున్నామని తెలిపారు. రూ.50 వేలకు పైగా విలువచేసే ఒక్కొక్క కిట్‌లో 23 క్రీడా పరికరాలు ఉంటాయని తెలియజేశారు. ఈ స్పోర్ట్స్ కిట్స్‌ను రాష్ట్రవ్యాప్తంగా 18 వేల గ్రామాలలో పంపిణీ చేస్తామని ప్రకటించారు.

దేవర కరుణాకర్‌కు నివాళులు


గుడిమల్కాపూర్‌లో దివంగత దేవర కరుణాకర్‌కు నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

గోల్కొండ: ప్రజాభిమానం మెండుగా ఉన్న నాయకుల్లో గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ నేడు మన మధ్య లేకపోవడం పెద్ద లోటని బీజేపీ సీనియర్ నాయకులు దేవర శ్రీనివాస్ అన్నారు. దివంగత దేవరకరుణాకర్‌కు బుధవారం గుడిమల్కాపూర్‌లోని గాయత్రీనగర్ కాలనీలో పితృతర్పణం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఎవరికి తలవంచకుండా ప్రజల వెంట ముందుకుసాగి సమస్యలు పరిష్కరించుకోవడంలో దేవర కరుణాకర్‌కు ఎవరు సాటిలేరని అన్నారు. కార్యక్రమంలో దేవర వంశీ, అశ్విన్, శ్రీకాంత్‌సాగర్, ప్రభుపూజారి తదితరులున్నారు.

దొంగతనాలు చేస్తున్న వ్యక్తికి జైలు

గౌలిపురా: దొంగతనాలు, అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తికి నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ కె.లలితా 9 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ ఎం.రవీందర్ తెలిపిన మేరకు.. తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన షేక్ ఖాజా పాషా (19) భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గత కొన్ని రోజులుగా చిన్న చిన్న దొంగతనాలు, అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. దీంతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకొని బుధవారం కోర్టులో హాజరు పరచగా... పూర్వా పరాలను పరిశీలించిన ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ లలితా నిందితునికి 9 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఐటీఐ విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు


విద్యార్థికి పట్టా అందజేస్తున్న ప్యారం నర్సయ్య

విజయనగర్‌కాలనీ: ఐటీఐలో వృత్తి విద్య కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు వివిధ సంస్థలు, పరిశ్రమల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అపారమైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఉపాధి శిక్షణ శాఖ రిజినల్ డిప్యూటీ డైరెక్టర్ ప్యారం నర్సయ్య, శాంతినగర్ ఐటీఐ ప్రిన్సిపల్ పసుపులేటి అన్నారు. వివిధ కోర్సులు పూర్తిచేసిన వారికి బుధవారం శాంతినగర్ ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... ఐటీఐలో అందిస్తున్న ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, కంప్యూటర్, మోటర్, డిజిల్ మెకానిక్, సివిల్ తదితర కోర్సులను చదువుకున్న విద్యార్థులు నేడు దేశ విద్యాశాలలోను ప్రముఖ సంస్థలో కీలక పదవులు నిర్వహిస్తున్నారన్నారు.కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ కేవి.చంద్రశేఖర్, హైదరాబాద్ జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి నందిగామ మైత్రిప్రియ, వివిధ ఐటీఐల ప్రిన్సిపల్స్, శిక్షణాధికారులు మధుసుదన్‌రావు, సాయిబాబ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి


దాడిలో తీవ్రంగా గాయపడిన సయ్యద్ ముస్తాఫా

సంతోష్‌నగర్: ఓ యువకుడి అర్ధరాత్రి కొందరు యువకులు కత్తులతో దాడి చేసిన సంఘటన బుధవారం సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.శివచంద్ర తెలిపిన మేరకు.. సంతోష్‌నగర్ భానునగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ ముస్తాఫా అలియాస్ ఇర్ఫాన్ (20) మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో తన స్నేహితులు జాఫర్, అన్వర్, అహ్మద్‌లతో కలిసి బాలాపూర్‌లోని సప్తగిరి బార్‌కి మద్యం సేవించడానికి వెళ్లారు. అనంతరం అక్కడి నుంచి అర్ధరాత్రి 12.10 గంటలకు అందరూ కలిసి కుమ్మర్‌వాడీ బన్నాకా రోడ్డు షాహీన్ స్వీట్ హౌజ్ వద్దకు చేరుకున్నారు. జాఫర్ తన తోటి సోదరుడి కుమార్తెను వేధింపులకు గురి చేయడంపై అక్కడే ఉన్న ఫైజాన్, సైఫ్‌లను ఆరా తీసి మందలించాడు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న జునైద్, అహ్మద్, ఖాలీద్, అక్బర్‌లు సైతం వారి వద్దకు చేరుకొని గొడవకు దిగారు. ఈ గొడవలో సయ్యద్ ముస్తాఫాపై జునైద్, అహ్మద్‌లు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. తీవ్రంగా గాయపడిని సయ్యద్ ముస్తాఫాను చికిత్స నిమిత్తం స్నేహితులు ఆసుపత్రికి తరలించారు. దీనిపై బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈ దాడిలో నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు శ్రీనివాస్ రెడ్డి, రాంచందర్ రెడ్డి

చార్మినార్: ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకొని మెరుగైన సమాజం కోసం యువత కృషి చేయాలని జీహెచ్ఎంసీ చార్మినార్, మలక్‌పేట్ స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) నోడల్ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, రాంచందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ సిటీ కళాశాల సోషల్ సైన్సెస్ విభాగాల ఓటు నమోదు, వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని భారత ఎలక్షన్ కమిషన్ ఇటీవల సాంకేతికతను వినియోగించి స్కానర్ ద్వారా మొబైల్ యాప్ ద్వారా ఓటు హక్కును ఎలా నమోదు చేసుకోవచ్చో వివరించారు. ఓటు హక్కు అవగాహన, నమోదు కోసం ప్రతి కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులతో ఒక క్లబ్ ఏర్పాటు చేయాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐజాజ్, అధ్యాపకులు డాక్టర్ రత్న ప్రభాకర్, డాక్టర్ భాస్కర్, లతారాణి, పి.శాంతి పాల్గొన్నారు.

ప్రొఫెసర్ స్వామినాథన్ మృతి దేశానికే తీరని లోటు


స్వామినాథన్ చిత్రపటానికి నివాళులర్పించిన డాక్టర్ సోమమార్ల తదితరులు

అబిడ్స్: ప్రముఖ వ్యవసాయ శాస్త్ర ప్రొఫెసర్ ఎం.ఎస్.స్వామినాథన్ మృతిచెందడం భారతదేశానికే తీరని లోటని రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ సోమమార్ల పేర్కొన్నారు. చాపల్ రోడ్డులోని స్టాన్లీ ఇంజనీరింగ్ మహిళా కళాశాలలో డాక్టర్ ఎంఎస్.స్వామినాథన్ స్మారక సెమినార్ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ సోమమార్ల మాట్లాడుతూ... ప్రొఫెసర్ ఎం.ఎస్.స్వామినాథన్ భారతదేశంలో ఆహార కొరతను తీర్చడంలో ప్రముఖ పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సత్యప్రసాద్ లంకా, కళాశాల డైరెక్టర్ డీన్ ప్రొఫెసర్ ఎ.వినయ్‌బాబు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

గోల్కొండ: బీజేపీ ఆధ్వర్యంలో పేదలు, రోగులకు ప్రయోజనం చేకూర్చేందుకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గుడిమల్కాపూర్ డివిజన్ బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండిత్ దీన్‌దయాల్‌తో పాటు మహాత్మగాంధీ స్ఫూర్తితో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. పేదల బస్తీలలో వైద్య శిభిరాలను నిర్వహించి నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాంపల్లి అసెంబ్లీ కన్వీనర్ పవన్‌కుమార్ కొల్లూరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

సమస్యల పరిష్కారానికి చర్యలు


బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ తెలిపారు. బుధవారం ఉదయం ఆయన డివిజన్‌లోని యాకుత్‌పురా, రెయిన్‌బజార్, సూపర్‌బజార్, మౌలా కా చీల్లా, ముర్తుజానగర్, మదీనానగర్, దోభీఘట్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పలు యాకుత్‌పురాలో చేపట్టిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రహరీగోడ నిర్మాణ పనులను, క్రీడా మైదానం, పార్కులో నెలకొన్న సమస్యలపై స్థానికులతో ఆరా తీశారు.

విద్యార్థుల శ్రమదానం

చార్మినార్: విద్యార్థులు తమ ఇళ్లు, ఇంటి పరిసరాల పరిశుభ్రతతో పాటు పాఠశాల పరిసరాలను పరి శుభ్రంగా ఉంచుకోవాలని ఎన్‌సీసీ అధికారి శిరీషా అన్నారు. తెలంగాణ గర్ల్స్ బీఎన్ ఎన్‌సీసీ సికింద్రాబాద్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ప్రదీప్‌కుమార్ పర్యవేక్షణలో బుధవారం జరిగిన స్వచ్ఛతా హీ సేవా హై కార్యక్రమంలో జేడబ్ల్యు ఇన్‌స్టిట్యూషన్ ముఖరంజా స్కూల్,పురానీహవేలీ విద్యార్థులు పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్రిన్సిపాల్ రేఖా వాధే తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా మజ్లిస్



గోల్కొండ: మజ్లిస్ పార్టీ పేదలకు అండగా ఉంటూ వస్తున్న ఏకైక పార్టీ అని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన సంక్షేమ పథకాల లబ్దిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన వివిధ పథకాలకు ఎంపికైన వారికి మంజూరు పత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్వాన్ నియోజకవర్గంలో అర్హులైన వారందరికి డబుల్ బెడ్‌రూమ్ మంజూరైయ్యేలా చూస్తానని అన్నారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.